శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 37.5°C | కనిష్ఠం : 23.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.35 గం..
సహర్ : ఆదివారం ఉ : 4.49 గం..



రసకందాయం

పొలిటికల్ ట్విస్టులతో ఉత్కంఠగా ఓరుగల్లు రాజకీయం

- కడియం ఎంట్రీతో కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్
- టికెట్ కోసం రెండు నెలలుగా ప్రయత్నాలు
- ఎంపీ టికెట్ కడియంకు ఇస్తే తమ పరిస్థితేంటోనని ఆందోళన
- వరంగల్ అభ్యర్థి కోసం 'గులాబీ' పార్టీ అన్వేషణ
- అవకాశం ఇవ్వాలని ఉద్యమకారుల డిమాండ్
- తెరపైకి పెద్ది స్వప్న, డిన్నా, జోరిక తదితరుల పేర్లు

వరంగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నేతలు ఇస్తున్న ట్విస్టులతో ఓరుగల్లు పాలిటిక్స్ రక్తికడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదను పెడుతున్నాయి. దీంతో అనూహ్యంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య ఎన్నికల్లో పోటీ చేయలేనని చెప్పి, తన తండ్రి ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశమైంది. అయితే ఇన్నాళ్లు కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న నేతలకు ఇది మింగుపడటం లేదు. వరంగల్ టికెట్ కడియంకు ఇస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఆశావహులున్నారు. కావ్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకుంటున్న గులాబీ నేతలు వరంగల్ అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమవడంతో తెరపైన అనేక మంది ఆశావహులు క్యూ కడుతున్నారు. అనూహ్య మలుపులతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు ఉత్కంఠగా మారాయి.

కడియం పొలిటికల్ యూటర్న్..

ఓరుగల్లు రాజకీయాలు యూటర్న్ తీసుకున్నాయి. అనూహ్య నిర్ణయాలతో రాష్ట్ర వ్యాప్తంగా వరంగల్ పాలిటిక్స్ హాట్‌హాట్‌గా మారాయి. అనూహ్య పరిణామాల మధ్య ఈ నెల 13న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నెల 31న మడికొండలో ఉమ్మడి జిల్లా ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ ఏర్పాట్లలో ఉన్న బీఆర్‌ఎస్ శ్రేణులకు కడియం కావ్య గురువారం రాత్రి విడుదల చేసిన లేఖ కంటి మీద కునుకు లేకుండా చేసింది. పోటీ నుంచి తప్పుకోవడమే కాకుండా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతుండటం కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా ఉన్న కడియం శ్రీహరి తన కుమార్తెతో కలిసి కాంగ్రెస్‌లో చేరి, కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలో దిగేందుకు ప్రయత్నాలు చేయడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, సంపత్‌కుమార్, రోహిత్ చౌదరి, విష్ణునాథ్, రోహిన్‌రెడ్డి తదితరులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కడియం ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌లో రావాల్సిందిగా ఆహ్వానించారు. అందుకు

మిగతా 7వ పేజీలో..

తిలకించి.. పులకించి..

- వైభవంగా నరసింహుని రథోత్సవం
- కొమ్మలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- ఉప్పొంగిన భక్తిభావం

వివరాలు : 7లో..



కొమ్మాలలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం
ఉత్సవ మూర్తులు



నిర్లక్ష్యంతో.. నీటి కష్టాలు..

బల్దియా ఉద్యోగుల ఇష్టారాజ్యంతో నగరవాసుల అవస్థలు

- అస్తవ్యస్త ఫిల్టర్ బెడ్లతో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు
- లీకులమయంగా పాత పైప్‌లైన్లు
- నిత్యం మరమ్మతులకు గురవుతున్న శుద్ధీకరణ మోటార్లు
- రిపేరు చేయడంలో అధికారుల ఉదాసీనత
- కమిషనర్ దృష్టిసారించాలని వేడుకోలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27: అసలే ఎండాకాలం.. ఇప్పటికే చాలా చోట్ల లీకేజీలు.. ఆపై అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వం.. మనదేం పోతుందిలే.. నెలకు జీతాలు వస్తున్నాయిగా? అనే కోణంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో పాటు పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యం కారణంగా నగరవాసులు నీటికష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 66 డివిజన్‌లకు నీటిని శుద్ధిచేసి తాగునీరు అందించాల్సిన ఫిల్టర్‌బెడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఫిల్టర్ బెడ్ల నాణ్యతా ప్రమాణాల గురించి పట్టించుకున్న వారే కరువయ్యారు. మూడు ప్రాంతాలు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారాయి. నిబంధనల ప్రకారం తాగునీటిని శుభ్రం చేయకపోవడంతో కొలమానం ప్రకారం శుద్ధి కావలసిన నీరు రా వాటర్‌గానే సరఫరా అవుతున్నాయి.

ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి వడ్డెపల్లి, కేయూ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్‌లకు ఉండే పెద్ద లైన్‌కు పురాతన పైపులు వేసి ఉండడంతో చాలా చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలకు అందాల్సిన మంచి నీరు వృథా అవుతోంది. ఫిల్టర్ బెడ్లలో కాస్తో కూస్తో శుభ్రం చేసి ప్రజలకు అందించాలనుకున్నా.. రోడ్లపై జల్లెడను తలపించే లీకేజీలు ప్రజలకు పెను సవాల్‌గా మారాయి. అయితే మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సరఫరా అయ్యే నీటిలో ప్రజలను నమ్మించేందుకు బ్లీచింగ్ పౌడర్ కలిపి పంపిస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ చుట్టుపక్కల స్వచ్ఛ ఆటోలు పార్కింగ్ చేయడంతో నీరు కలుషితమవుతున్నాయి. కొన్ని కాలనీలకే మూడు రోజులకోమారు నల్లా నీరు వచ్చినా అది కూడా కలుషితమైన నీరు వస్తుండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇందుకుతోడు పైపులైన్ లీకేజీల నుంచి మురుగునీరు తాగునీటిలో కలిసి వస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాలకు మునిసిపల్ నీటిమాటే తెలియదంటే అతిశయోక్తి కాదు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

40 యేళ్ల పైపు లైన్.. 30 లీకేజీలు..

కేయూ క్యాంపస్‌లోని రుద్రమాంబ మంచి నీటి కేంద్రం నుంచి ప్రతీ రోజు ప్రజలకు అందించే ప్రధాన పైపు లైన్ 40 యేళ్ల కిందట నిర్మాణం జరిగింది. కేయూ నుంచి హనుమాన్‌నగర్, పెగడపెల్లి జంక్షన్, కొత్తూరు, రెడ్డికాలనీ, యాదవనగర్, కృష్ణకాలనీ, పెద్దమ్మగడ్డ వరకు మూడు కిలోమీటర్ల మేర 30 లీకేజీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ పైపు గుండా రెండు, మూడు రోజులకోమారు కాలనీలో వచ్చే నీరు.. చివరి ఇంటిని చేరలేకపోతున్నాయి. ప్రజావాణి ద్వారా ప్రజలు ఫిర్యాదు చేసిన ప్రతీసారి అధికారులు కార్పొరేషన్ నిధుల నుంచి నామమాత్రంగా పనుల పేరుతో బిల్లులు కాజేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ మార్గంలో మురుగు నీరు ప్రవహించే డ్రైనేజీలో మంచినీటి పైపులైన్లు ఉండడం, అవి కూడా లీకేజీలు అయి ఉండడంతో మంచినీరు కాస్త డ్రైనేజీ నీరుగా మారుతున్నాయని ప్రజలు మొత్తుకుంటున్నారు. ఇటీవల కొత్తలైన్ వేసేందుకు నిధులు మంజూరైనప్పటికీ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల పనులు మొదలు కావడం లేదనే సిబ్బంది తెలిపారు.

నామమాత్రంగా విధులు

వడ్డెపల్లి, కేయూ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్ల ఇంజనీరింగ్ అధికారులతో పాటు సుమారు 110 మంది ఆపరేటర్లు, హెల్పర్లు, లైన్‌మెన్లు, గ్యాంగ్‌మెన్లు, డ్రైవర్లు

మిగతా 8వ పేజీలో..



కేయూ ఫిల్టర్‌బెడ్‌లో మోటారుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది



దేశాయిపేటలో శిథిలావస్థకు చేరిన ఫిల్టర్‌బెడ్ పైకప్పు



కేయూ రోడ్డులో వాల్వ్ నుంచి వృథాగా పోతున్న నీరు



కేయూలో వాల్వ్ నుంచి లీకవుతున్న నీరు

రేపు దేవరుప్పులకు కేసీఆర్ రాక

- ఎండిన పంటలను పరిశీలించనున్న బీఆర్‌ఎస్ అధినేత

వివరాలు : 6లో..





కాలిన కాంప్లెక్స్‌లోని రెండు, మూడు అంతస్తులు

అదుపులోకి మంటలు..

- తీవ్రంగా శ్రమించిన ఫైర్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది
- కాంప్లెక్స్‌లో నిబంధనలు పాటించకపోవడంతో మరింత ప్రమాదం
- పనిచేయని అగ్నిప్రమాద రక్షక పరికరాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కొండా మురళి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

7

పసిడి ధర.. ధగ ధగ

- తులం బంగారం రూ.70వేలకు చేరువ
- వెండి కిలో రూ.80,800



వరంగల్ చౌరస్తా, మార్చి 29: పసిడి బంగారం ధర శుక్రవారం మరింత పెరిగింది. మూడు రోజుల్లో రూ. 2వేలు పెరగగా శుక్రవారం నికరంగా తులం బంగారం ధర రూ. 68,730 చేరింది. 22 క్యారెట్ల బంగారం 10గ్రాములు రూ.1,300 పెరగడంతో రూ.63వేలకు చేరింది. అలాగే 24క్యారెట్ల బంగారం 10గ్రాములు రూ. 1,420 పెరగడంతో తులం రూ.68,730 చేరింది. కిలో వెండి రూ. 80,800 చేరింది. వివాహాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో బంగారు నగల ఆభరణాల కొనుగోళ్లు పెద్దగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం వారం రోజుల క్రితం రూ. 64 వేల చిల్లర ఉండటంతో శుక్రవారం నాటికి రూ.68,730లకు చేరింది. మరో రెండు మూడు రోజుల్లో బంగారం ధర తులం రూ.70 వేలకు చేరే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నారు.

కేటీఆర్‌పై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

గీసుగొండ, మార్చి 29: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి శుక్రవారం గీసుగొండ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. సీఎం బిల్డర్‌లు, కాంట్రాక్టర్‌ల వద్ద అక్రమంగా వసూలు చేసిన రూ.2,500 కోట్లను ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానానికి ముడుపులు చెల్లించారని ఈనెల 27న హైదరాబాద్ తెలంగాణ భవన్ ప్రెస్‌మీట్‌లో నిరాధారమైన ఆరోపణలు చేశారని చాడా తెలిపారు. అలాగే పార్లమెంటు ఎన్నికల తర్వాత సీఎం బీజేపీలోకి మా రుతారని.. సీఎం పరువుకు భంగం కలిగేలా కేటీఆర్ మాట్లాడారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతి నిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు కొండేటి కొమురారెడ్డి, జావేదు, కూసం రమే ష్, కందుల అశోక్, దాసారపు సారయ్య పాల్గొన్నారు.



గీసుగొండలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సంగెంలో పీఎస్‌లో..

సంగెం: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌పై శుక్రవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ఐనరేష్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్‌పై నమ్మకనే కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారనిన్నారు. ఆ పార్టీ పతన స్థితిలో ఉండడంతో మతిస్థిమితం కోల్పోయి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు అచ్చనారగాజు, జనగాం రమేష్, రవీందర్ నాయక్, ఆగపాటి రాజు, పులి సాంబయ్య, కాగితాల జగన్నాథచారి, పోతుల ప్రభాకర్, గోపాల్ పాల్గొన్నారు.

ఘరానా మోసం

- ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.4.50కోట్లు వసూలు
- ముఠాలోని తొమ్మిది మందిలో ఒకరి అరెస్టు



వరంగల్ క్రైం, మార్చి 29: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గ్రూపు-1 ఉద్యోగాలు ఇప్పిస్తామని మో సం చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి న తొమ్మిదిమంది ముఠా సభ్యుల్లో ఒకరిని సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ పిన్నవారి వీధికి చెందిన కొత్త వీరేశం అనే వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని రూ.25లక్షల విలువ కలిగిన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. తన కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం ఇప్పిస్తానని 2020లో కొత్త వీరేశం తన నుంచి రూ.2.5కోట్లు తీసుకుని మోసం చేశాడని వారం శ్రీదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు.. డబ్బులు తీసుకుని మోసం చేసిన వీరేశంను గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు తెలిపినట్లు అన్నారు.

వరంగల్‌కు చెందిన కొత్త వీరేశం డబ్బులు సంపాదించాలనే అత్యాశతో తన కుమారుడు గోపీనాథ్, హైదరాబాద్‌కు చెందిన మిత్రుడు గూడూరు పవన్, ఇతడి భార్య వెంకట పద్మజతో ఒక ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. ఈ నలుగురు.. మరో ఐదుగురితో ముఠాగా ఏర్పడి పలువురి వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించామన్నారు. వీరేశం ఐదుగురి నుంచి రూ.4కోట్ల 50లక్షలు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. వీరేశం, అతడి స్నేహితుడు పవన్.. కరీంనగర్‌కు చెందిన ప్రతిమ ఆస్పత్రి యజమాని బోయినపల్లి శ్రీనివాస్‌రావు లాంటి పెద్దవారితో పరిచయాలున్నాయని ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేశారని ఆయన పేర్కొన్నారు. వీరికి ఉటుకూరి శ్రీనివాస్ అనే అడ్వకేట్ సహకరించినట్లు విచారణలో వీరేశం తెలిపినట్లు ఏసీపీ వెల్లడించారు. వీరేశంను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.25లక్షల విలువైన నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో 8మంది పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల్లో కొత్త వీరేశంతోపాటు హైదరాబాద్‌కు చెందిన గూడూరు పవన్, గూడూరు పద్మజ, వరంగల్‌కు చెందిన కొత్త గోపీనాథ్, ఖమ్మంకు చెందిన ఉటుకూరి శ్రీనివాస్‌రావు, ప్రకాశం జిల్లాకు చెందిన బుచ్చిబాబు, నర్సంపేటకు చెందిన బోయినపల్లి రవిందర్‌రావు, వరంగల్‌కు చెందిన కొత్త అరుంధతి, కొత్త పూజిత ఉన్నారు. పరారీలో ఉన్నవారిని పట్టుకుంటామని, వీరి వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదని ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. విలేకర్ల సమావేశంలో సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ సాంబయ్య పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఐనవోలు, మార్చి 29: పురుగుల మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. ఐనవోలుకు చెందిన చింత సారయ్య(47) తనకున్న ఎకరం భూమితోపాటు మూడెకరాల భూమి కౌలుకు తీసుకొని సాగుచేశాడు. పంట పెట్టుబడులకోసం అప్పుచేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. చేసిన అప్పులు చెల్లించలేక మనస్థాపానికి గురై ఈ నెల 27న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు సామ్యేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడి


శ్రీపతిపల్లిలో స్వాధీనం చేసుకున్న లిక్కర్

వరంగల్ క్రైం, మార్చి 29: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పలుచోట్ల బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. శుక్రవారం నాలుగుచోట్ల చేసిన దాడుల్లో రూ.40వేల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనగర్ రూ.11,100, ఇదే ప్రాంతలోని మరో రెండుచోట్ల రూ.6,260, రూ.8,840 చెల్పూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీపతిపల్లి లో రూ.13,160 విలువైన లిక్కర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

రేపు దేవరుప్పులకు కేసీఆర్ రాక


ఎండిన పంటలను పరిశీలించనున్న బీఆర్ఎస్ అధినేత

జనగామ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జిల్లాల బాట పట్టారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఆదివారం పర్యటించనున్న ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో ఎండిన పంటలను పరిశీలిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గజ్వేల్‌లోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ మీదుగా 10.30 గంటలకు దేవరుప్పుల మండలానికి చేరుకుంటారు. దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండా, ధర్మాపురం గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పిస్తారు. అక్కడ నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, తర్వాత నల్లగొండ జిల్లా హాలియాకు వెళ్లి పంటలను పరిశీలిస్తారు. కేసీఆర్ జనగామ పర్యటన నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్న సమయంలో కేసీఆర్ ఆకస్మికంగా జిల్లాల పర్యటన చేపట్టడం, అది కూడా ఎండిన పంటల పరిశీలనకు రావడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న క్రమంలో ఆయన జిల్లాల పర్యటన ద్వారా బీఆర్ఎస్ శ్రేణుల్లో భరోసానివ్వాలని భావిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి నేతల వలసలు, ఫోన్ ట్యాపింగ్ పరిణామం, కవిత లిక్కర్ కేసు లాంటి అంశాల నుంచి ప్రజల దృష్టి మరల్చడంలో భాగంగానే కేసీఆర్ ఈ పర్యటన చేపట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో పొగలు

భయాందోళనలకు గురైన ప్రయాణికులు

కాజీపేట, మార్చి 29: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ బీ-4 కింద భాగంలోని బ్యాటరీలో శుక్రవారం రాత్రి పొగలు వచ్చాయి. సికింద్రాబాద్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ రైల్వే స్టేషన్ రాగానే బీ - 4 బోగి కింద చిన్నగా పొగలు రావడంతో గమనించిన ప్రయాణికులు రైలు కాజీపేట హాల్టింగ్ కాగానే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు.. బోగీవద్దకు చేరుకుని సమస్యను గుర్తించారు. ఎలక్ట్రికల్ స్టాఫ్‌కు, ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న ఎలక్ట్రికల్ సిబ్బంది దెబ్బతిన్న బ్యాటరీని తొలగించారు. కొత్త బ్యాటరీని అమర్చి పంపారు. దీంతో రైలు రాత్రి 10 గంటలకు బయలు దేరి రెండు గంటలు ఆలస్యంగా వెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో రైల్వే అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.















పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఓటర్లను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ● వరంగల్, మానుకోట లోకసభ స్థానాల్లో పెరిగిన సంఖ్య

ఆ మేరకు అదనంగా పోలింగ్ కేంద్రాలు.. సౌకర్యాలపై దృష్టి ● ఒకే కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు



హనుమకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల నగారాను మోగించడంతో క్షేత్రస్థాయిలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేయడంలో మునిగిపోయారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులతో పాటు కీలకమైన అంశాలపై కసరత్తు జోరుగా సాగుతోంది. పెరిగిన ఓటర్లను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అధికారులు కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రతిపాదనలు పంపడం పూర్తయింది. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండడం వల్ల ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు ఆసక్తి చూపడం లేదన్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు లోకసభ నియోజకవర్గాల పరిధిలో..

వరంగల్ లోకసభ పరిధిలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో కలిసి మొత్తం 18,16,500 మంది ఓటర్లు ఉన్నారు. 1899 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 419 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. కాగా మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు- డోర్నకల్ (ఎస్టీ) మహబూబాబాద్ (ఎస్టీ) నర్సంపేట, ములుగు (ఎస్టీ), పినపాక (ఎస్టీ) ఎల్లందు (ఎస్టీ) భద్రాచలం (ఎస్టీ) ఉన్నాయి. ఈ నియోపక వర్గం పరిధిలో మొత్తం 15,26,998 మంది ఓటర్లు ఉన్నారు. 1783 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో గతంలో కన్నా 2 లక్షల మందికిపైగా ఓటర్లు పెరిగారు. ఆమేరకు పోలింగ్ కేంద్రాలు కూడా పెరిగాయి.

ఒకే చోట ఓటేసేలా..

ఒకే కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. శాసనసభ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను లోకసభ ఎన్నికల్లో కొనసాగించనున్నారు. ఒక కుటుంబంలో సాధారణంగా మూడు నాలుగు ఓట్లు ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలో ఈ సంఖ్య రెట్టింపు ఉండొచ్చు. అయితే అక్కడక్కడ కొన్ని కుటుంబాల్లో ఒకరు ఓ పోలింగ్ కేంద్రంలో, మరొకరు మరో పోలింగ్ కేంద్రంలో ఓటేసే పరిస్థితులు ఉంటున్నాయి. తద్వారా కొంత మంది ఓటేసేందుకు అసక్తి చూపించడం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. అందుకే ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బీఎల్‌వోల సహకారం లేదా సాంకేతిక సాయంతో ఈ ప్రక్రియకు పూనుకుంటున్నారు. శాసనసభ ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 2024 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే విడులైంది. దీని ప్రకారం జనవరి 6 నాటికి పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయితే ఏప్రిల్ ఒకటవ తేదీతో 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశాన్ని కూడా ఎన్నికల సంఘం కల్పించినందు వల్ల ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదుకు గడువు ఉంది. గతంలో జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉండేది. కానీ ఈసారి ఏప్రిల్ 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఏర్పాటయ్యే పోలింగ్ కేంద్రాలను బట్టి ఓటర్ల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. మార్పులు, చేర్పులు, విచారణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య:

ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల వారీగా గరిష్ఠంగా 1,300 వరకు ఓటర్లను చేర్చారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 1,290 మంది ఓటర్లు ఉండగా మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో అతితక్కువగా 300 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో చాలాచోట్ల ఓటర్ల సంఖ్య తక్కువగానే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య గరిష్ఠంగా 1,500 ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఎక్కువ దూరం ఉండొద్దని భావిస్తున్నారు. 1,500 మంది కంటే అధిక ఓటర్లుంటే ఆయా చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఏదేని పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు తలెత్తినట్టు గుర్తించినా, ఓటర్లకు దూరంగా ఉన్నట్టు ఫిర్యాదులు అందినా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. మార్పులు, చేర్పుల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశముందని సమాచారం

మరో సారి పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఇటీవలి శాసన సభ ఎన్నికల సందర్భంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ ఆయా పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి నివేదిక అందించాలని ఎన్నికల సంఘం డిసెంబర్‌లోనే ఆదేశించింది. మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభల పరిధిలోని 14 శాసనసభ సెగ్మెంట్లలో అయా ఎన్నికల నిర్వహణాధికారులు, రెవెన్యూ అధికారులు ఆ మేరకు పోలింగ్ కేంద్రాల పరిశీలన పూర్తి చేసి కలెక్టర్లకు నివేదిక అందించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం యువత, మహిళ, దివ్యాంగుల కోసం ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆకర్శిణీయంగా తీర్చిదిద్దాల్సి ఉంది. నియోజవర్గానికి మూడో వంతున ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాలను భవనంలోని కింది అంతస్థులోనే ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగు లు మొదటి అంతస్థులోకి వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బంది పడతారన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నది. దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్నిచోట్ల తాగునీటి వసతి ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది పోలింగ్ రోజు కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి. విద్యుత్ సౌకర్యం, వేసవి ఎండల తీవ్రత ఉండటంతో ఫ్యాన్లను ఏర్పాటు చేయాలి. గాలి, వెలుతురు ఉండే భవనాలను పోలింగ్ కేంద్రాల కోసం ఎంపిక చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరపరాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్ సమకూర్చుకోవాలి. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ రోజు ఓటర్లకు నీడ కల్పించేందుకు షామియానా ఏర్పాటు చేయాలి. వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవడానికి వీలుగా అవసరమైనన్ని బెంచీలు అందుబాటులో ఉంచాలి. మెడికల్ కిట్లతో పాటు వేసవి దృష్ట్యా ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచాలి. పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబా టులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సహకరించేలా వలంటీర్లను నియమించుకోవాలి. కేంద్రాలకు రాలేని వారి కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఓటు ప్రాధాన్యతను తెలిపే గోడపత్రికలను పోలింగ్ కేంద్రాల బయట అందుబాటులో ఉంచాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన వసతులు కల్పించేందుకు శ్రద్ధ తీసుకోవడంపై అధికారులు దృష్టి పెట్టారు.

తిలకించి.. పులకించి

- వైభవంగా నరసింహుని రథోత్సవం
- కొమ్మాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన క్యూలైన్లు





శ్రీలక్ష్మినరసింహస్వామి గర్భగుడి ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు, స్వామివారి రథం

గీసుగొండ, మార్చి 29: కొమ్మాల శ్రీలక్ష్మినరసింహస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలతో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచియున్నారు. సాధారణ దర్శనానికి 3 గంటలు పట్టింది. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. ఆలయానికి వెనుక వైపు నుంచి వచ్చే శీఘ్ర దర్శన మార్గం ఇరుకుగా ఉండటంతో గాలి ఆడక భక్తులు అవస్థలు పడ్డారు. శుక్రవారం ఒక్కరోజే 25వేల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ ఈవో శేషగిరిరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పవన్‌కుమార్, ఎస్‌ఐలు వెంకన్న, జానీపాష పోలీస్ సిబ్బంది బందోబస్త్ నిర్వహించారు.

మారుమోగిన గోవింద నామస్మరణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో ఘట్టం ఉత్సవమూర్తుల రథోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. 25 ఫీట్లు ఎత్తులో ఉన్న రాతి చక్రరథంను రంగులు, పూలతో అందంగా అలంకరించారు. శ్రీలక్ష్మినరసింహస్వామిని, భూదేవి, నీలాదేవిల ఉత్సవ మూర్తులను రథంలో ఆలయ గుట్ట చుట్టూ ఊరేగించారు. రథంపై పసిడికాంతుల్లో వెలుగొందుతున్న ఉత్సవమూర్తులను తిలకించి భక్తులు పులకించిపోయారు. రథోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తులు గోవిందా నామస్మరణలు మారుమ్రోగాయి. రథాన్ని గుట్ట చుట్టూ తిప్పేందుకు భక్తులు పోటీపడ్డారు. మమ్మేలు స్వామి.. మా కోర్కెలు తీర్చే దేవుడివంటూ భక్తులు సందడి చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, ఫణీంద్ర, విష్ణు, ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, ఈవో శేషగిరి, ఉత్సవ కమటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఉగాది వరకు జాతర కొనసాగుతుందని జాతర నిర్వహకులు తెలిపారు.

రసకందాయం

(5వ పేజీ)

కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో సుముఖత వ్యక్తం చేయడంతో ఆయనతో పాటు డాక్టర్ కడియం కావ్య కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు.

నేడు కాంగ్రెస్ గూటికి కడియం

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కడియం శ్రీహరి, కావ్య శనివారం కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానంపై కడియంకు కాంగ్రెస్ హామీ ఇవ్వటంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వరంగల్ స్థానం తన కుమార్తెకు ఇవ్వాలని శ్రీహరి కోరుతున్నారు. కానీ శ్రీహరినే వరంగల్ ఎంపీగా బరిలో దించితేనే విజయావకాశాలు ఉంటాయని భావిస్తున్న కాంగ్రెస్.. ఆ తర్వాత స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ స్థానానికి వచ్చే ఉపఎన్నికల్లో కావ్యకు టికెట్ ఇస్తామని హామీ ఇస్తున్నారు. కానీ శ్రీహరి మాత్రం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇస్తేనే బాగుంటుందని ఒత్తిడి తెస్తున్నారు. శనివారం పార్టీలో చేరిన తరువాత అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో వరంగల్ ఎంపీగా కడియం ఫ్యామిలీ నుంచి ఒకరు పోటీలో ఉండటం పక్కా అనేది స్పష్టమైందన్న చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ ఆశావహుల్లో అయోమయం

వరంగల్ టికెట్ కోసం టీపీసీసీకి 42మంది దరఖాస్తు చేసుకోగా.. వీరితో పాటు మరో ఆరడజను మందకి పైగా రేసులో ఉన్నారు. రెండు నెలలుగా కాంగ్రెస్ అధిష్ఠానం వారి జాబితాను వడపోసి.. నలుగురైదుగురు పేర్లతో తుది జాబితాను సిద్ధం చేసింది. వీరిలో ప్రముఖంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు శనిగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య, జన్ను పరంజ్యోతి, రాగమళ్ల పరమేశ్వర్, పెరుమాండ్ల రామకృష్ణ, బొడ్డు సునితతో పాటు మరో డజను మందికి పైగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. వీరిలో ఒకరికి టికెట్ పక్కా అనుకున్నారు. నేడోరేపో వరంగల్ అభ్యర్థి పేరును అధిష్ఠానం ఖరారు చేస్తుందని భావించారు. అయితే అనూహ్యంగా కడియం శ్రీహరి తన కుమార్తె కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వస్తుండటంతో తమ పరిస్థితి ఏంటన్న ఆందోళనలో ఆశావహులున్నారు. ఇప్పటికే టికెట్ కోసం.. పెద్దల ఆశీస్సుల కోసమంటూ హైదరాబాద్, ఢిల్లీ చక్కర్లు కొట్టిన నేతలకు కడియం చేరిక మింగుడు పడటం లేదు.

అభ్యర్థి కోసం 'గులాబీ' పార్టీ అన్వేషణ


తాను ఎంపీగా పోటీ చేయలేనని కడియం కావ్య కేసీఆర్‌కు లేఖ రాయడంతో బీఆర్ఎస్ మరో బలమైన అభ్యర్థిని వెతికే పనిలో పడింది. అయితే ఉద్యమకారులకే టికెట్ ఇవ్వాలని కొంత కాలంగా డిమాండ్ వినిపించగా.. తాజా పరిస్థితుల్లో ఆ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. మాజీ కార్పొరేటర్ డిన్నా, జోరిక రమేష్ పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇదే క్రమంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నను బరిలో దించాలని కొందరు నేతలు సూచిస్తున్నారు. ఇక ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మళ్లీ గులాబీ గూటికి చేరుతారని, ఆయన్ను పార్టీలోకి తీసుకుని ఎంపీ టికెట్ ఇస్తారనే ప్రచారం కూడాఉంది. మరోవైపు ప్రజాశాంతి పార్టీ వరంగల్ అభ్యర్థిగా ఖరారైన సినీనటుడు బాబుమోహన్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని, ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించొచ్చని సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతోంది.

కడియంపై గులాబీ నేతల గుర్రు..

కడియం శ్రీహరి తీరుపై ఆ పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌తో ఆటు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని డిమాండ్ చేశారు. నా డు ఎన్‌టీఆర్‌కు, నేడు కేసీఆర్‌కు కడియం శ్రీహరి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. హనుమకొండ, స్టేషన్‌ఘనపూర్‌తో పాటు పలు చోట్ల కడి యం శ్రీహరి దిష్టిబొమ్మలను బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మొత్తానికి కడియం శ్రీహరి పొలిటికల్ యూటర్న్ ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తోంది.

కడియం చేరికపై కార్యకర్తల్లో అసంతృప్తి

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి29: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంపై కాంగ్రెస్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆమె మాట్లాడుతూ 30 ఏళ్లుగా కడియం శ్రీహరి కాంగ్రెస్ కార్యకర్తలను పెట్టిన ఇబ్బందులను దీపాదాస్ మున్షికి వివరించామన్నారు. రెండు రోజుల్లో వేలాది మంది కార్యకర్తల సమక్షంలో భారీ సభ ఏర్పాటు చేసి కడియం శ్రీహరి చేరికను కాంగ్రెస్ కార్యకర్తలు ఏ రకంగా వ్యతిరేకిస్తున్నారో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కీసర దిలీప్‌రెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, దామెర నాగరాజు, బిట్ల బాబు, బూడిది సదానందం, చీటకోరు సంపత్, బండ రమేష్, మందపురం ఉపేందర్, దేవరాయ రాజు, ఏలె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి కడియం రాజీనామా చేయాలి..

నమ్మకంతో గెలిపిస్తే కేసీఆర్‌ను, ప్రజలను మోసం చేశాడు ● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధర్మసాగర్, మార్చి 29: నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి వెంటనే రాజీనామా చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజు అధ్యక్షతన నిర్వహించి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలు కడియం శ్రీహరిని ఎంతో నమ్మకంతో ఎన్నికల్లో గెలిపిస్తే ఆయన మోసం చేసి బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులను ఒక్కొక్కరిని పార్టీ నుంచి బయటికి పంపిస్తున్నాడని తెలిపారు. డబ్బులు, పదవులు తీసుకుని బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ అస్తిత్వానికి కడియం ప్రమాదకరంగా మారాడని విమర్శించారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి కడియం తెలంగాణ ఉద్యమంలో లేడని, మాదిగ పోరాట సమితిలో లేడని, అహంకారంతో వ్యవహరిస్తూ ఏ పార్టీ అధికారంలో ఉంటే, అపార్టీకి అండగా ఉంటూ, ఆ పార్టీలో పదవులను పొందడం సిగ్గు చేటన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌తో ఎన్నో పదవులను అనుభవించి ఏనాడు మాదిగలకు సహాయం చేయకుండా, పార్టీలో, రాజకీయంగా ఎదగనీయకుండా వ్యవహరించాడని విమర్శించారు. నాడు ఎన్‌టీఆర్‌కు, నేడు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఘన్‌పూర్ నియోజకవర్గానికి మోసం చేశాడన్నారు. బిడ్డ కోసం ముసలితనంలో పదవుల కోసం దిగజారడం సరి కాదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేని లోటును తానే తీరుస్తానని నాయకులకు, కార్యకర్తలకు పల్లా భరోసా ఇచ్చారు. రానున్న ఎంపీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో మాదిగ బిడ్డను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరిత, జిల్లా నాయకులు ప్రభుదాస్, చాడ కుమార్, ఎంపీటీసీ శోభ, జూబేద, లాల్, నర్సింగరావు, జానీ మండల నాయకులు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య'ఘాతం

కరెంట్ షాక్‌తో చేపల వేట..

ప్రాణాలతో వేటగాళ్ల చెలగాటం

సాధారణంగా చేపలను వలవేసి, లేదా గాలాలు వేసి పడతారు. మరీ ఎక్కువగా చేపలు ఉంటే నీటి ప్రవాహానికి అడ్డంగా కట్టలు వేసి వేటాడుతారు. కానీ కొందరు ఇందుకు భిన్నంగా కరెంట్ షాక్‌తో చేపలను పడుతున్నారు. గీసుకొండ మండలం రాంపూర్ గ్రామం సమీపంలోని కాకతీయ కెనాల్‌లో శుక్రవారం కొందరు యువకులు కరెంట్ షాక్ ద్వారా చేపలు పడుతుండడం కనిపించింది. ఒక పొడవాటి కర్రకు విద్యుత్ వైర్లను కట్టి.. దానిని చేపలు ఉన్న చోట నీళ్లలో షార్ట్‌సర్క్యూట్ చేసి చేపలవేట సాగిస్తున్నారు. కరెంట్‌షాక్ తగలగానే చేప చనిపోయి నీళ్లపైకి తేలుతుంది. రెండు మీటర్లకుపైగా పొడవైన కర్రను ఉపయోగించడంవల్ల చేపలు వేటాడే వారికి స్వల్పంగా షాక్ తగులుందని చెబుతున్నారు. అయితే ఇదే పద్ధతిని అనుసరించి చాలామంది మృత్యువాత పడ్డ సంఘనలున్నా కొందరు పట్టించుకోకుండా ప్రమాదానికి దగ్గరగా వెళుతున్నారు.

ఫొటో : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, హనుమకొండ



నేడు నగరంలో నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29: హనుమకొండ నయీంనగర్ నాలా వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న దృష్ట్యా కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలో నీటి సరఫరా అయ్యే ప్రాంతాల్లో నేడు (శనివారం) నీటి సరఫరా ఉండదని నగర పాలక సంస్థ ఈఈ బీఎల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు అనుగుణంగా పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాగా కేయూ ఫిల్టర్‌బెడ్ నుంచి నీరు సరఫరా అయ్యే పబ్లిక్‌గార్డెన్, గుడిబండల్, కొత్తూరు, మచిలీబజార్, పద్మాక్షికాలనీ, యాదవనగర్, విద్యారణ్యపురి, హసన్‌పర్తి, భీమారం, చింతగట్టు, ముచ్చెర్ల, పలివేల్పుల, వంగపహాడ్, గుండ్లసింగారం, పెగడపెల్లి, గోపాలపురం, కేయూ జంక్షన్ ప్రాంతాల్లో ఒక్క రోజు పాటు నీటి సరఫరా ఉండదని వెల్లడించారు. నగర ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు.

ఫోన్‌ట్యాపింగ్‌పై ఉన్నతస్థాయి సంస్థలతో

దర్యాప్తు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కాళోజీ జంక్షన్, మార్చి 29: రాష్ట్రాన్ని దోచుకోవడానికి నిరంకుశ పాలకులుగా నిరంతరం కల్వకుంట్ల వంశ పారంపర్య రాజరికాన్ని అనుభవించడానికి కుట్రపూరితంగా కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ఉపయోగించుకున్నారని ప్రముఖ సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఆయన నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. తన కులానికి చెందిన అనేక మంది పోలీసు అధికారులను, విశ్రాంత పోలీసు అధికారులను ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్ర పోషించడానికి నామినేటెడ్ పదవులు ఇచ్చి, మరికొంత మందికి ప్రమోషన్లు కల్పించి వినియోగించుకున్నారని ఆరోపించారు. తన బంధు వర్గానికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధ్యతలు అప్పగించి రాజకీయ నాయకుల కార్పొరేట్ సంస్థల యజమానుల, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి వేల కోట్ల రూపాయల ధనం, వేల ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారని పత్రికల్లో కథనాలు వెలువడుతున్నాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే హవాలా మార్గంలో సుమారు రూ.300కోట్లు చెల్లించి ఇజ్రాయిల్ దేశం నుంచి ఫోన్ ట్యాపింగ్ సామగ్రిని తెప్పించారని అన్నారు. పౌరస్పందన వేదిక నాయకుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా మిషనరీని తెప్పించడం మనీ ల్యాండరింగ్ కింద నేరంగా పరిగణిస్తారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సాధారణమైన క్రిమినల్ యాక్టివిటీ కాదని, దీన్ని అనేక కోణాల నుంచి దర్యాప్తు చేసి పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలంగాణ మేధావులు భావిస్తున్నారని ప్రముఖ సామాజిక వేత్త బొమ్మినేని పాపిరెడ్డి అన్నారు. ఈ వ్యవహారం దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అమెరికా మాజీ అధ్యక్షుడు నిక్సన్ వాటర్‌గేట్ కుట్ర కేసు కంటే దుర్మార్గమైనదని రాజకీయ విశ్లేషకుడు సోమా రాంమూర్తి అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా సుప్రీంకోర్టు సిట్టింగ్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తుల ద్వారా విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు రావడానికి అవకాశం ఉంటుందని ఇతర పౌర స్పందన నాయకులు అభిప్రాయపడ్డారు.

అదుపులోకి మంటలు

పోచమ్మమైదాన్/మట్టెవాడ, మార్చి 29: వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదం జరగ్గా... అర్ధరాత్రి దాటిన తర్వాత మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అలాగే శుక్రవారం ఉదయంకూడా రెండో అంతస్థు నుంచి మంటలు మరోసారి ఎగిసిపడటంతో వెంటనే వాటిని ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రెండు, మూడో అంతస్థుల్లోని బ్లాకులు పూర్తిగా కాలిపోగా.. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊరిపిపీల్చుకున్నారు. అయితే కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాద నిరోధక నిబంధనలను సరిగా పాటించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగినట్టు తెలుస్తోంది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో, వీ కన్వెన్షన్ హాల్‌లోని సామగ్రి, ఫర్నిచర్ బూడిదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం విద్యుత్, అగ్ని మాపక శాఖ, పోలీసు క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల వారీగా కారణాలను విశ్లేషించి నివేదికను రూపొందించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు సుమారు 5.30గంటల సమయం పట్టిందని, అర్ధరాత్రి తర్వాత నియంత్రించగలిగామని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రూ.70లక్షల ఆస్తి నష్టం

ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని ఆయా శాఖలు తమ ప్రాథమిక విచారణలో తేలింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో గతేడాది అధికలోడ్‌తో ఏసీలు కాలిపోయాయని స్థానికులు చెబుతుండగా.. ఇప్పుడు కూడా లోడ్ కన్నా ఎక్కువగా ఏసీలు వాడటంతోనే ఏసీలు బ్లాస్ట్ అయి మంటలు వ్యాప్తి చెందాయని విద్యుత్ శాఖ సిబ్బం ది పేర్కొంటున్నారు. కాంప్లెక్స్‌కు కార్పొరేషన్ నుంచి ఫైర్ ఎన్‌వోసీ 2014లో తీసుకొని ఇప్పటి వరకు దాన్ని రెన్యువల్ కూడా చేసుకోలేదు. పదేళ్లుగా యజమానులను హెచ్చరిస్తున్నా పట్టించుకోలేదని అధికారులు చెబుతున్నారు. కాంప్లెక్స్‌లోని ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చినా ఏ ఒక్కటీ పనిచేయడం లేదని, ఆ పరికరాలను ఆర్నెల్లకోసారి తనిఖీ చేయాల్సి ఉండగా అలాంటి తనిఖీలు ఏవీ లేవన్నారు. ఇక ఈ ప్రమాదంలో సుమారు రూ.70 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్ మేనేజర్ ఇల్లందుల సందీప్‌కుమార్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 28న రాత్రి 7.05గంటలకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో సిబ్బంది ఆఫీసులో ఉండగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దం వచ్చి కొన్ని క్షణాల్లోనే ఆఫీసులోని ఏసీల నుంచి మంటలు వచ్చాయన్నారు. సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, పొగలు కమ్ముకోవడంతో బయటకు వచ్చామని, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చామన్నారు. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లోని లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీస్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్, బేరిఫ్ రెస్టారెంట్, వొద్దిరాజు కన్వెన్షన్ హాల్, రిలయన్స్ డిజిటల్స్‌కు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. మొత్తం నష్టం సుమారు రూ.70 లక్షలు ఉంటుందని ఇల్లందుల సందీప్‌కుమార్ తన ఫిర్యాదులో పేర్కొనగా.. ఆ మేరకు కేసు నమోదు చేశామని మట్టెవాడ సీఐ గోపి తెలిపారు.



అగ్నిప్రమాదంలో బూడిదైన సామగ్రి



శుక్రవారం ఉదయం మరోసారి ఎగిసిన మంటలు

క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ అధికారుల పరిశీలన

సంఘటన జరిగిన జకోటియా కాంప్లెక్స్‌లో శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, పోలీసు క్లూస్ టీమ్ సభ్యుడు దేవేందర్, ఫోరెన్సిక్ సైంటిఫిక్ రాము, విద్యుత్ శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు ప్ర మాదానికి గల కారణాలను పరిశీలించారు. విద్యుత్ సంబంధించిన పరికరాలను పరిశీలించారు. అలాగే ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు శుక్రవారం సందర్శించారు. అధికారులు, బాధితులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. అలాగే వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, భారతీయ జనతా పార్టీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కూడా షాపులను పరిశీలించి.. బాధితులకు ధైర్యం చెప్పారు.

4న వరంగల్ జడ్పీ సర్వసభ్య సమావేశం

హనుమకొండ సిటీ, మార్చి 29: వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న జరగనుంది. అదాలత్ సమీపంలోని జిల్లా పరిషత్ కౌన్సిల్ హాలులో సమావేశాన్ని నిర్వహించనున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ క్రమంలో సమావేశం పరిమిత నిబంధనలకు అనుగుణంగా జరగనుంది. నిధుల కేటాయింపులు, చెల్లింపులు, పరిపాలన సంబంధమైన నూతనంగా నిర్ణయాలకు తావు ఇవ్వకుండా వివిధ అంశాలను సమీక్షించనున్నారు.

నేడు హనుమకొండ సమావేశం..

కాగా, హనుమకొండ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు అదాలత్ సమీపంలోని జిల్లా పరిషత్ కౌన్సిల్ హాలులో సమావేశం జరగనుంది. వివిధ ప్రభుత్వ శాఖల అంశాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.



కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అనిల్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత అనిల్

కరీమాబాద్, మార్చి29: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కరీమాబాద్‌కు చెందిన వొగిలిశెట్టి అనిల్ శుక్రవారం మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో సీనియర్ నాయకులుగా, డివిజన్ ప్రెసిండెంట్‌గా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, డివిజన్ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జీగా పనిచేశారు. అంతకుముందు తెలుగుదేశం పార్టీలో నగర తెలుగు యువత అధ్యక్షుడిగా మూడుసార్లు బాధ్యతలు చేపట్టారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కూడా పనిచేశారు. అనంతరం అప్పటి రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా కొండా దంపతులు వొగిలిశెట్టి అనిల్‌ను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు.

గృహ హింస చట్టం కింద పలువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట, మార్చి 29 : గృహ హింస చట్టం కింద భర్తతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని గొల్లభామతండా గ్రామానికి చెందిన భూక్య రాజేందర్‌కు ఇదే గ్రామానికి చెందిన సునితతో 10ఏళ్ల క్రితం వివాహమైంది వీరికి ఇద్దరు అబ్బాయిలు జన్మించారు. కొన్నాళ్లు వీరి జీవితం సాఫీగా సాగినా ఇటీవల సునితను అదనపు కట్నంతో పాటు, పలు రకాల చిత్రహింసలు పెట్టుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు సునిత ఫిర్యాదు మేరకు భర్త రాజేందర్, అత్త వీరమ్మ, మరిది నవీన్, ఆడబిడ్డతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుడిసెవాసుల ఆందోళన

కరీమాబాద్, మార్చి 29: జక్కలొద్ది ప్రాంతంలోని సీపీఐ గుడిసెవాసులు శుక్రవారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే జక్కలొద్ది ప్రాంతానికి చెందిన కొందరు యువకులు, శివనగర్ ప్రాంతానికి చెందిన కొందరు యువకులకు మధ్య శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద గల బార్‌షాపు సమీపంలో జరిగిన తగాదా విషయమై 20 రోజుల క్రితం రెండు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ గొడవ విషయమై శుక్రవారం జక్కలొద్ది అభివృద్ధి కమిటీ అధ్యక్షుడైన రామాసందీప్ అనే వ్యక్తికి నోటీస్ అందించేందుకు, సంతకం చేయాలని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇచ్చిన సమాచారంతో రామాసందీప్ స్టేషన్‌కు సాయంత్రం చేరుకున్నాడు. నిబంధన ప్రకారం నోటీసు ఇవ్వకుండా, సంతకం చేయించుకోకుండా సీఐ మల్లయ్య స్టేషన్‌లోనే కొట్టాడు. సమాచారం తెలుసుకున్న జక్కలొద్ది గుడిసెవాసులు వందల సంఖ్యలో పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీ నందిరామ్ నాయక్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గుడిసెవాసులతో, సీఐతో చర్చించారు. అనంతరం రామాసందీప్‌కు నోటీస్ జారీ చేశారు. తమ నాయకుడు రామాసందీప్‌పై కావాలనే కొందరు రాజకీయ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహించారు.



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేపడుతున్న గుడిసెవాసులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవిందర్

ఖిలావరంగల్, మార్చి 29: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పేదలకు న్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవిందర్ అన్నారు. శుక్రవారం శివనగర్‌లో టీడీపీ 42వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. రవిందర్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు పార్టీని స్థాపించి, కేవలం 9 నెలల కాలంలోనే ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారన్నారు. ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం అని నమ్మిన సిద్ధాంతాలతో పార్టీని స్థాపించి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకోసం ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఠాగూర్ గణేష్ సింగ్, నాయకులు బజ్జూరి వీరేశం, తౌటం సంపత్, కంద్రాతి రాజు, కంద్రాతి రవి, కంద్రాతి శ్రీకాంత్, పొలెపాక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో.. నీటికష్టాలు..

5వ పేజీ తరువాయి

పని చేస్తున్నారు. వీరు ప్రతీ రోజూ వారు పని చేస్తున్న ఫిల్టర్ బెడ్ల వద్ద మూడు షిఫ్టులలో పని చేయాల్సి ఉంది. కానీ కొందరు సిబ్బంది అధికారుల అండదండలతో బయోమెట్రిక్ (వేలిముద్ర) వేసి విధులు నిర్వర్తించకుండా బయటకు వెళ్లిపోతున్నట్టు సమాచారం. ఇంకా కొందరు ఏఈ, డీఈ స్థాయి అధికారులను మచ్చిక చేసుకుని విధులకు రాకున్నా నెలకు కొంత ముట్టజెప్పి జీతాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇంకా కొందరు అధికారులు ప్రజా ప్రతినిధులను మచ్చిక చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా చెలామణీ అవుతూ ఫిల్టర్‌బెడ్ విధులకు డుమ్మా కొడుతున్నారు. వడ్డెపల్లిలో ఒక డ్రైవర్, ఒక లైన్‌మెన్ సుబేదారి కార్యాలయంలో ఉంటూ అధికారుల కొమ్ముకాస్తున్నట్టు తెలుస్తోంది. కేయూ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్లలో పని చేస్తూ నలుగురు సిబ్బంది తంబ్ (వేలిముద్ర) వేసి ఇతర వ్యాపారాలు, కాంట్రాక్టు పంచాయితీలు చేస్తున్నట్టు సమాచారం. కొత్త కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వచ్చిన తర్వాత కూడా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధులకు హాజరు కావడం లేదనే ఆరోపణలున్నాయి. ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేయడంతో పాటు సిబ్బందిని గాడిలో పెట్టాల్సిన బాధ్యత కొత్త కమిషనర్‌పై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

బాధితులకు కార్పొరేటర్ పరామర్శ

కరీమాబాద్, మార్చి29: రోజువారి కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్స పొందుతున్న బాధితులను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, ఇతర నాయకులు శుక్రవారం పరామర్శించారు. డివిజన్‌కు చెందిన తెలంగాణ మహిళా ప్రధాన కార్యదర్శి ఆవునూరి సునీత, బీఆర్ఎస్ డివిజన్ నాయకులు పోగుల రాజుకు కాలు విరిగిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, బూత్ కన్వీనర్లు అంకం దేవానంద్, మరుపల్ల గౌతం, రాజన్‌బాబు, సురేష్, మోహన్, రంజిత్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొలుపుల చంద్రకళ, ఉపాధ్యక్షులు వహీద, చీర రమేష్, మంద నవీన్ తదితరులు ఉన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం వహించరాదు'



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రామిరెడ్డి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27: ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ స్క్వాడ్, ఎన్నికల వ్యయ పరిశీలకులన బృందాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ నిరంతరం విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు తీసుకోవాలని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటాం: ఎమ్మెల్యే

వరంగల్‌సిటీ, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ చేరిన ప్రతీ ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజ్ అన్నారు. నగరంలోని 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌టీఆర్‌నగర్, సుందరయ్యనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఈర్ల రాజేందర్, పిట్ట నగేష్, ఆర్మూర్ కుమార్, ఈర్ల రాజు, ఎండి. నజీమా, ఆకారపు రాములు, ఓర్సు అంజయ్య, కె.భరత్, జె.ప్రశాంత్, పిట్ట సుధీర్ పాల్గొన్నారు.

ఉప్పల్ రైల్వే సైడింగ్ ప్రారంభం

జెండా ఊపి ప్రారంభించిన సింగరేణి సీఎండీ బలరామ్



బొగ్గు రైలును ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ

కాకతీయఖని, మార్చి 29: సింగరేణి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన రైల్వే సైడింగ్‌ను, బొగ్గును రవాణా చేసే రైలును ఆ సంస్థ సీఎండీ బలరాంనాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి బొగ్గు బావుల్లో ఉత్పత్తి అవుతున్న బొగ్గును రైలు వ్యాగన్ల ద్వారా ఇతర ప్రదేశాలకు తరలించేందుకు సింగరేణి యాజమాన్యం పూనుకుందన్నారు. ఈ క్రమంలో బొగ్గును స్టోర్ చేసేందుకు రైల్వే స్థలాన్ని లీజ్‌కు తీసుకున్నామన్నారు. భూపాలపల్లి ఏరియా నుంచి రోజుకు సుమారు 3వేల టన్నుల బొగ్గును ఉప్పల్ రైల్వే స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి రైలు మార్గాన వినియోగదారులకు తరలిస్తామన్నారు. అందులో భాగంగానే ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే, సింగరేణి, శ్రీకో ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గూడ్స్ షెడ్డును ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈడీ(సీఎం) ఆల్విన్, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ బర్తేష్ కుమార్‌జైన్, సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు, ఓఎస్‌డీ హబీబ్‌హుస్సేన్, అధికారులు జ్యోతి, శ్యామ్‌ప్రసాద్, ఉత్తమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ఖిలావరంగల్, మార్చి 29: నగరంలోని గుడ్ ఫ్రైడే వేడుకల్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం 18వ, డివిజన్ గాంధీనగర్‌లోని ఆసిస్సీ తెలుగు బాప్టిస్టు చర్చిలో యూదులు, రోమన్ సైనికులు యేసుక్రీస్తు తలపై ముళ్లకిరీటాన్ని పెట్టి, కల్వరి గుట్టపైకి శిలువతో మోయించడం, శిలువపై ఆయనను ఉంచి మేకులు కొట్టడం, చివరకు ఆయన మృతి చెందిన తీరును కళ్లకు కట్టినట్టి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫాదర్‌లు నీలూరి జ్యోనెస్, నామ్‌దేవ్, కె. ప్రభాకర్, సంఘ పెద్దలు తెలుగు చిన్నప్పమాజీ కార్పొరేటర్ బొట్ల సదానందం, బాసాని విమల, సుండి ప్రతాప్‌రావు, నరిశెట్టి రాయన్న, జక్కం ప్రవీణ్, బుర్రి సంజీవకుమార్, అంతోని విక్టోరియా, ప్రకాశమ్మ, పుల్ల రమేష్, మర్రి ఉమ, శ్రీకర్ పాల్గొన్నారు. లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు.

» వరంగల్ సిటీ నగరంలోని 19వ డివిజన్‌లోని భగత్‌సింగ్ నగర్ బేతస్థ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవ కరుణ్ శ్రవణ్, ప్రెసిడెంట్ కొమ్ము రాజు, సెక్రటరీ పోలెపాక ప్రసాద్, కోశాధికారి కొమ్ము జయధర్, కొమ్ము అనురాధ, జన్ను స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



ఆసిస్సీ చర్చిలో సిలువతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

నేటినుంచి అభయాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు

కరీమాబాద్, మార్చి 29: శంభునిపేట గణేష్ నగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో నేటి (శనివారం) నుంచి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరు శ్రీనివాసరావు, సుతారి రాజు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాలనీలో స్వయంభువుగా వెలసిన అభయాంజనేయ స్వామి విగ్రహ పత్రిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా నేడు అంకురార్పణ, స్వస్తి, పుణ్యాహవచనం, 31న ఆదివారం యాగశాల ప్రవేశం, హోమం, గ్రామోత్సవం, లక్ష్మిపూజ, కుంకుమ పూజ, ధాన్యాధి, జలాధి వాసాలు, ఏప్రిల్ 1న సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన,యంత్ర ప్రతిష్ఠాపన, తొలిదర్శన పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి చిన్నాల రాధా, కిషన్, ముఖ్య సలహాదారు గుగులోతు విజయ్, ఉపాధ్యక్షులు అలువాల సారంగం, రంజిత్, రవీందర్, సహాయ కోశాధికారులు రవిబాబు, లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు బండి అశోక్, కందగట్ల రాకేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు సాంబయ్య, కొమురెల్లి, సుమన్, రవి, రాకేష్ పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరించిన కొండా

వరంగల్ సిటీ, మార్చి 29: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు కొమ్ముల బాబు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి ఎర్ర శోభన్‌బాబు, కొమ్ముల అఖిల్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాకు సమస్యల వినతి..

ఓసిటీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం శుక్రవారం జనాలతో కిక్కిరిసిపోయింది. అలాగే వారంలో ఐదు రోజులు నేను లేదా కొండా మురళీధర్‌రావు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి సురేఖ చెప్పారు. దీనిలో భాగంగా దీంతో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన ప్రజలు, ముఖ్యంగా జక్కలొద్దికి చెందిన గుడిసెవాసులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలు చెప్పుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కనకయ్య

వడుప్సా, ట్రస్మా సమావేశాన్ని సక్సెస్ చేయాలి

పోచమ్మమైదాన్, మార్చి 29: వరంగల్ జిల్లా అన్ ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని నేడు (శనివారం) పైడిపెల్లిలోని నలందా హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు వడుప్సా జిల్లా అధ్యక్షుడు బొల్లం కనకయ్య తెలిపారు. పైడిపెల్లిలో శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సమావేశంలో ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. వడుప్సాలోని బాధ్యులు, పాఠశాలల నిర్వాహకులు హాజరై జనరల్‌బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి బలవారి సుధీర్, ఎస్. సుధాకర్, విద్యాసాగర్, ఎస్.రాజు, మహ్మద్ నసీరుద్దీన్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ శివకుమార్

పెట్రోలింగ్ నిర్వహించిన సీఐ

వరంగల్ చౌరస్తా, మార్చి 29: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండిబజార్‌లో వ్యాపార రద్దీ ట్రాఫిక్ అధికంగా ఉండటంతో శుక్రవారం సాయంత్రం ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ ట్రాఫిక్ నియంత్రించి పెట్రోలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా వ్యాపార లావాదేవీలకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు.

బార్ అధ్యక్షుడికి అభినందనలు

కరీమాబాద్, మార్చి29: వరంగల్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తీగల జీవన్ గౌడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఉదయం విశ్వనాథ్‌కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, ఎన్‌పీఎస్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తీగల జీవన్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



పంట కాలువలను పరిశీలించిన ఐబీ అధికారులు

ఖానాపురం, మార్చి 29 : మండలంలోని పాకాల ఆయకట్టులోని పంట కాలువలను శుక్రవారం ఐబీ డీఈ రమేష్‌తో పాటు అధికారులు పరిశీలించారు. తుంగబంధం కాలువలో జేసీబీ సహాయంతో నాచు, చెత్తాచెదారాన్ని తొలిగించే పనులను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారంతో కాలువలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరె రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.



తుంగబంధం కాలువను పరిశీలిస్తున్న ఐబీ డీఈ

రోడ్డు వేశారు.. బ్రిడ్జి మరిచారు!



రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాయపర్తి, మార్చి 29 : ఆరు నెలల క్రితం రోడ్డు వేసి, బ్రిడ్జి నిర్మాణం చేయకుండా వదిలేశారు.దీంతో వాగు నుంచి వస్తున్న నీటి ఉధృతితో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు నీటి ప్రవాహనికి కొట్టుకుపోయే పరిస్థితి దాపరించింది. మండలంలోని సన్నూరు గ్రామ శివారులోని ఎలికట్టె వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉండగా దాని నిర్మాణాన్ని ఇప్పటి వరకు కనీసం ప్రారంభించకపోవడంతో ఇటు వాహనదారులు, అటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు నుంచి సన్నూరు గ్రామం వరకు సుమారు రూ.60 లక్షలకు పైగా డబ్బులు వెచ్చించి వేసిన తారు రోడ్డు అసంపూర్తిగా ఉండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్..

2023 అక్టోబర్ నెలలో ఈ పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎలికట్టె వాగు వద్ద రెండు చెరువుల వరద కలిసే చోట తప్పనిసరిగా బ్రిడ్జిని ఏర్పాటు చేయాల్సిన కాంట్రాక్టర్ తాత్కాలికంగా పైపులే వేసి వాటిపై మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఎస్సారెస్పీ కెనాల్ నుంచి చెరువుల్లోకి నీరు చేరి మత్తడి పోసి నీరు పైపులపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో రోజు ఆ మార్గం గుండా వెళ్లే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే ట్రాక్టర్లు, కూలీల ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాత్రి వేళల్లో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో బ్రిడ్జిని నిర్మాణం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనధికారిక విద్యుత్ కోతలు లేవు



స్టాండ్ పై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

వర్ధన్నపేట రూరల్, మార్చి 29 : పట్టణంలో అనధికారిక విద్యుత్ కోతలులేవని వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రెండో వార్డు రాజస్థాన్ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 27న ఆ కాలనీ డీటీఆర్ కింద ఉన్న నివాస గృహాలకు మాత్రమే రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగిందని, పట్టణమంతా విద్యుత్ కోతలు విధించలేదని స్పష్టం చేశారు. ఇంకా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్మించాల్సిన గద్దెను నిర్మించలేదని, అప్పటి వరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా స్టాండ్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. విద్యుత్ కోతలు ఉన్నాయని వస్తున్న ప్రచారం నిజం లేదని, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి కోతలు విధించినా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చెప్పాలని తెలిపారు.

శిథిలావస్థలో ప్రధాన తూములు

లీకేజీలతో పాకాల సరస్సు నుంచి వృథాగా పోతున్న సాగునీరు

ఏళ్లు గడుస్తున్నా నియంత్రణ చర్యలు శూన్యం

యాసంగి పంటకాలం పూర్తికాగానే మరమ్మతులు చేపట్టాలి

ఖానాపురం, మార్చి 29 : జిల్లాలోని ప్రముఖ సరస్సుల్లో పాకాల సరస్సు ప్రాధానమైనది.కాకతీయుల వారసత్వ సంపదలో ప్రత్యేకస్థానం ఉన్న పాకాల సరస్సు నిర్వాహణ అధ్వానంగా తయారైంది. పాకాల సరస్సు అభివృద్ధి విషయంలో పాలకులు. నేతలు పట్టించుకునే పాపాన లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటితో పాటు తాగునీటిని అందిస్తూ అన్నపూర్ణమ్మగా వెలుగొందుతున్న పాకాల సరస్సుకు ప్రధానంగా టవర్ తూము, సంగెం తూము ఉన్నాయి. ఈ తూముల నిర్వాహణపై పట్టింపు లేక పోవడంతో తూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫలితంగా సాగు నీరు లీకేజీల రూపములో మున్నేరు (పాకాల వాగు) పాలవడంతో రైతులు కలత చెందుతున్నారు. ఏటా 3-4 అడుగుల నీరు వృధాగా పోవడంతో 1000-1200 ఎకరాల సాగుకు ఉపయోగపడే సాగునీరు వృధాగా పోతుంది.

అబ్బురపరిచే తూముల నిర్మాణాలు

40-50 ఏళ్ల క్రిత్రం నిర్మాణం చేపట్టిన తూములు నిర్మాణాలు అబ్బురపరిచే విధంగా ఉన్నాయి. పాకాల అభయారణ్యంలో పడిన ప్రతి నీటి చుక్క సరస్సులోకి చేరేవిధంగా చుట్టూ గుట్టల నడుమ నాటి కాకాతీయ రాజులు 1213లో పాకాల తటాకాన్ని నిర్మించారు. సరస్సులోని ప్రతీ నీటి చుక్క బయటకొచ్చేలా తూములను నిర్మించారు. తుగంబంధం(టవర్ తూము), సంగెం కాలువలకు అనుసంధానంగా తూముల నిర్మాణం చేపట్టారు. తుంగబంధం కాలువలోకి సరస్సులో నాలుగు అడగుల నీరున్నా నీరంత బయటకు వచ్చేవిధంగా టవర్ తూము నిర్మాణం చేపట్టారు. సరస్సులో 8 అడుగల నీరున్న బయటకు వచ్చేలా సంగెం తూము నిర్మాణం చేపట్టారు. దీనిని మిట్టతూము అని రైతులు వాడుక భాషలో పలుకుతారు.


శిథిలమవుతున్న తూములు

తూముల నిర్మాణాలు చేపట్టి అర్థశతాబ్ధం కావడంతో కాలక్రమేనా టవర్ తూము అంతర్భాగంలోని కట్టడం రాళ్లు ఊడిపోవడంతో సాగునీరు లీకేజీల రూపంలో వృధాగా పోతుంది. నీటి పారుదల శాఖ అధికారులు తాత్కాలికంగా ఎన్ని మరమ్మతులు చేపట్టినా లీకేజీ నియంత్రణ కావడం లేదు. తుప్పు పట్టిన తూముల తలుపులు తొలగించి అదునాతన తలుపులు పెట్టాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా సంగెం తూము తలుపులు తుప్పు పట్టి లీకేజీల రూపంలో సాగునీరు వృధాగా పోతుంది.



మున్నేరువాగులో కలుస్తున్న లీకేజీ నీరు





శిథిలావస్థలో ఉన్న పాకాల సరస్సు టవర్ తూము

పాకాల సంగెం తూము

టవర్ తూములో లీకేజీగా వెలువడుతున్న నీరు

రామప్ప-పాకాల ప్రాజెక్ట్ నిర్మాణంతో పాకాల ఆయకట్టులో ఏటా రెండు పంటల (వానాకాలం, యాసంగి)సాగుకు సరిపడా నీరు సరస్సులో నిలువ ఉంటుంది. 30 అడుగుల పూర్తి సామర్థ్యంగల పాకాల సరస్సులోకి వర్షాకాలంలో సంవృద్ధిగా వర్షాలు పడటంతో సరస్సు నిండుకుండను తలపిస్తూ ఉంటుంది. సరస్సులోకి నిండా నీరుచేరిన తరుణంలో వర్షాకాలం ఆరంభంలో లీకేజీలతో సాగునీరు వృధాగా పోవడంతో సరస్సుపూర్తిస్థాయిలో నిండటానికి ఎక్కువ సమయం పడుతుంది. 16-18 అడుగుల వరకు లీకేజీ మామూలుగా ఉన్నప్పటికీ సరస్సులో నీటి నిలువ పెరిగి 24 అడుగులకు చేరుకున్న సందర్భంలో సుమారు రెండు అడుగుల నీరు వృధాగా పోతోంది. ఈ లీకేజీ నీటితో సుమారు 1200ఎకరాలకు సరిపడ నీరు వృధాగా పోతుందని రైతులు వాపోతున్నారు. దీంతో లీకేజీ నీరు మన్నేరు వాగులో పడి జీవనదిలా ప్రవహిస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ యాసంగిలో సుమారు 18వేల ఎకరాలకు అధికారులు అధికారికంగా సాగుకు అనుమతి ఇచ్చారు. యాసంగి సాగుకోసం జనవరి 8న సాగునీటిని విడుదల చేసే సమయంలో పాకాలలో 22అడుగుల నీటిమట్టం ఉంది. కానీ పాకాల ఆయకట్టులో ప్రస్తుతం సుమారుగా 20వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండడంతో సాగునీటి సమస్య తలెత్తకుండా ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహించి రామప్ప నుంచి పాకాలకు గోదావరి జలాలు తరలిస్తున్నారు. యాసంగి ఆరంభం నుంచి పంటలకు మూడు నెలలుగా నిత్యం నీటిని విడుదల చేస్తున్నప్పటికీ గోదావరి జాలాలతో సరస్సు నీటిమట్టం రోజురోజూ క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 24 అడుగులకు చేరుకుంది. దీంతో రైతుల్లో యాసంగి పంటల సాగులో సాగు నీటి సమస్యకు ఢోకాలేకుండా ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సరస్సు తూముల నుంచి లీకేజీల రూపంలో సాగునీరు వృధాగా పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

లీకేజీని అరికడితేనే రామప్ప-పాకాల ప్రాజెక్టుతో ప్రయోజనం...

రూ.336 కోట్లతో పాకాలకు ప్రతీ ఏటా 3.23 టీఎంసీల అదనపు జాలాలను మళ్లించేందుకు రామప్ప-పాకాల ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి సరస్సులోకి అదనపు జలాలను మళ్లిస్తూ రెండో పంటకు నమ్మకంతో కూడిన సాగునీరు అందిస్తున్న ఈ తరుణంలో శిథిలావస్థలో ఉన్న పాకాల తూములకు మరమ్మతులు చేపడితే మరితం ప్రయోజనం చేకూరి ఉండేదని ఆయకట్టు రైతులు అంటున్నారు.

హామీలను అమలు చేయాలి...

పాకాల సరస్సులోకి వర్షాకాలంలో నీరురాగానే పర్యాటనకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు లీకేజీ నీటిని పరిశీలించే తరుణంలో ఆయకట్టు రైతుల విన్నపాల మేరకు లీకేజీని అరికడతామంటూ అక్కడి నుంచే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి లీకేజీలను అరికట్టడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించి, లీకేజీల నియంత్రణకు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారుతోంది. ఏటా పాకాల తూములకు మరమ్మతులు చేపడుతామంటూ కాలయాపన చేస్తున్న అధికార యంత్రాంగం ఈ ఏడాదైనా పాకాల తూముల పునఃనిర్మాణంపై దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మే మొదటి వారం వరకు యాసంగి పంట కాలం పూర్తయ్యే అవకాశం ఉన్నందున చెరువు నీటిమట్టం కనిష్టస్థాయికి చేరుకుంటుంది. ఈ తరుణంలో తూములకు మరమ్మతులు చేపట్టే విధంగా ఆధికారులు, పాలకులు దృష్టిసారించాలని ఆయకట్టు రైతుల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతుంది.

ఘనంగా గుడ్ ఫ్రైడే



తిమ్మారాయిన్‌పహాడ్‌లో క్రైస్తవుల శిలువ మోసే యాత్ర

చెన్నారావుపేట మార్చి 29: మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్‌లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని భక్తులందరూ పునితారాయప్ప చర్చికి చేరుకొని శిలువ మోసే యాత్రలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. పుర వీధుల్లో శిలువ యాత్రను కొనసాగించగా, ఏసు ప్రభువు మరణ త్యాగాన్ని స్మరిస్తూ ప్రభు అనుగ్రహం రావాలని ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు. ఈ సందర్భంగా విచారణ గురువు పాదర్ యాగారెడ్డి ప్రభు మరణంను ధ్యానిస్తూ, ప్రభువు త్యాగాన్ని, ప్రేమకు, విశ్వాస పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి పావని ప్రదీప్ కుమార్, ఎన్ను రాజు, భాస్కర్, శౌరి రాజు, ఇన్నయ్య, బాలస్వామి, రెడ్డిమాస్ కిషోర్, నాగేతు రాజు తదితరులు పాల్గొన్నారు.మండలంలోని పాత మగ్దుపురం, సూర్యపేటతండా, నెంబర్ వన్ కాలనీలతో పాటు పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు రోజంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ సహోదర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసు ప్రభువు మరణ త్యాగాన్ని గుర్తు చేశారు. చర్చి పరిధిలో 41రోజులు ఉపవాసం ఉన్న క్రైస్తవ భక్తులను ఉప దీక్ష విరమింప చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపు శ్రీనువాస్, గట్ల రవీందర్, బండారి భిక్షపతి, జిల్లా డైరెక్టర్ అకుల అశోక్, శంకేషి రంజిత్, సుభాషిణి, మంజుల, దొంతి సాయిలు తదితరులు పాల్గొన్నారం

• నెక్కొండ: నెక్కొండ మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలను జరిపారు. చర్చిలను రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరించారు. ప్రత్యేక పార్థనలు జరుపగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల పాస్టర్లు యేసుక్రీస్తు నిస్వార్ధంగా ప్రజలకు చేసిన సేవల గురించి వివరించారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ నగర్‌లో చర్చి ఫాదర్ గోగో ప్రకాష్ ప్రదీప్ మోజెస్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో శిలువను మోసే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన శిలువను మోసాడని గుర్తుచేశారు. మండలంలోని నల్లబెల్లిలో సైతం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు భక్తులు ఉదయాన్నే చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పారనంది రాజు, యాకర సందీప్, జోసఫ్, ఇల్లందుల అనిల్, మాగి శివ, జోగు జోసఫ్, ఆనంద్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి తీవ్రగాయాలు



ఖానాపురం, మార్చి 29: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడికి తీవ్రగాయాలైన సంఘటన బుధరావుపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల ఉబేద్ బుధరావుపేట జాతీయ రహదారి పక్కన ఉన్న మజీదు సమీపంలో రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుంచి గూడూరు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లడంతో బాలుడి తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి సంఘటనాస్థలానికి చేరుకొని అక్కడ ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి కారుకోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

• ఇద్దరికి గాయాలు

ఖానాపురం, మార్చి 29 : మండల కేంద్రంలో ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నర్సంపేటకు చెందిన ఆటో డ్రైవర్ ఆకులపెల్లి రవికుమార్ ఆటోలో బుధరావుపేట నుంచి నర్సంపేటకు వెళ్తూ ఖానాపురం మండల కేంద్రంలో హనుమాన్ సెంటర్‌కు చేరుకున్న క్రమంలో టేకులతండా నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న నరేష్ రోడ్డు దాటే క్రమంలో ఆటోను ఢీకొట్టడంతో ఆటో రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో రవికుమార్, నరేష్‌లకు గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో బాధితులను ఆస్పత్రికి తరలించారు.

నేడు పీఏసీఎస్‌లో మహాజన సభ

ఖానాపురం, మార్చి 29 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎల్)లో ఈ నెల 30న మహాజన సభ నిర్వహించనున్నట్లు సంఘం సీఈవో ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. ఉదయం 12 గంటలకు ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ అధ్యక్షతన నిర్వహించే మహాజన సభకు పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అదుపు తప్పిన బైక్.. ఒకరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 29 : పట్టణంలోని ఆకేరు వాగు బ్రిడ్జిపై ఉన్న వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన గడ్డల వెంకట స్వామి వర్ధన్నపేట నుంచి ఇల్లందకు వెళ్తున్న తరుణంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడిపోయాడు. దీంతో బలమైన గాయాలు కాగా, స్థానికులు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం

చెన్నారావుపేట, మార్చి 29 : మండలంలోని పాపయ్యపేట గ్రామంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గౌడ కులస్తులు శుక్రవారం కంఠహేశ్వర స్వామికి జలాభిషేకం పూజలను నిర్వహించారు. కంఠమహేశ్వర ఆలయంలో నూతనంగా ప్రతిష్టాపన చేసిన విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు.ఈ నెల 30న ఆలయంలో కంఠమహేశ్వరస్వామికి బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్, కుల పెద్ద మేడి ప్రభాకర్, మేడి రమేష్ గౌడ్, బుర్ర సుదర్శన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బండి రమేష్‌గౌడ్, మేడి భిక్షపతి, తాళ్ల సమ్మయ్య మేడి వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బార్' ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విక్రమ్



వర్ధన్నపేట రూరల్, మార్చి 29 : మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన బండారి విక్రమ్ వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నిక కాగా గ్రామస్థులు అభినందించారు. గురువారం రాత్రి హన్మకొండలోని కోర్టు ప్రాంగణంలో అడ్వకేట్ విక్రమ్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శీలం రాంబాబు

నర్సంపేట, మార్చి 29 : విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు 4వ వార్డు కౌన్సిలర్ శీలం రాంబాబు అన్నారు. పట్టణంలోని సర్వాపురంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు, మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి నర్సంపేటకు గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు., క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు.ఓడిన క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా తమ ప్రతిభ చాటేందుకు కృషిచేయాలన్నారు. గెలుపొందిన టీమ్‌కు శీలం అయోధ్య జ్ఞాపకార్థం రూ.40వేల నగదు పారితోషికం, షీల్డును అందజేయడం జరుగుతుందని క్రీడల ఆర్గనైజర్ తెలిపారు. కార్యక్రమంలో 117వ వార్డు కౌన్సిలర్ గోల్యానాయక్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, కూనమల్ల పృధ్వీరాజ్, నూనె రంజిత్, అచ్చ దయాకర్, భవాని శంకర్, సప్తగిరి, పట్టణ కార్యదర్శి విజయ్‌సింగ్, ప్రవీన్, రాజ్‌కుమార్, రవీంద్రచారి పాల్గొన్నారు.

రంగాపురంలో భగీరథ గేట్ వాల్వ్‌కు మరమ్మతు



భగీరథ గేట్ వాల్వ్ పనులను చేస్తున్న జీపీ సిబ్బంది

నల్లబెల్లి, మార్చి 29: మండలంలోని రంగాపురంలో మిషన్ భగీరథ ట్యాంక్, గేట్ వాల్‌లు కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఈ భగీరథ ట్యాంక్ ద్వారా గ్రామస్తులకు నీరు అందేదికాదు. ఈ సమస్య ఆంధ్రజ్యోతి దృష్టికి రావడంతో అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పనులు పేరుతో గతంలో పలు కథనాలను ప్రచురించింది. దీంతో యంత్రాంగం కదిలి శుక్రవారం జీపీ సిబ్బందితో ట్యాంక్‌ను శుభ్రం చేయించి, భగీరథ గేట్ వాల్‌ను రిపేర్ చేయించారు. రంగాపురం ప్రత్యేకాధికారి నరసింహమూర్తి ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి రామారావు మిషన్ భగీరథ పనులను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొన్ని ఏండ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ మిషన్ భగీరథ ట్యాంక్‌ను అన్ని విధాలుగా రిపేర్‌చేసి, గ్రామస్తులకు తాగునీరు అందించడమే తమ విధి అని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినందుకు ధన్యవాదాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య, జీపీ సిబ్బంది శనిగరం రమేష్, చిరంజీవి, సదయ్య, కారం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కడియంకు కాంగ్రెస్ పార్లమెంట్ టికెట్ ఇవ్వొద్దు



నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

నల్లబెల్లి, మార్చి 29 : కాంగ్రెస్ పార్టీ నుంచి కడియం శ్రీహరికి, కావ్యకు పార్లమెంట్ టికెట్ ఇవ్వద్దని శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు నిరసన వ్యక్తంచేశారు. దళిత నాయకుడు భట్టు సాంబయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి చేయబట్టి ఎందరో దళిత సామాజిక నాయకులకు అన్యాయం జరిగిందన్నారు. కడియంకు అన్ని రకాల పదవులు వివిధ అధికార పార్టీలో దక్కాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇది గుర్తించి మిగతా దళిత నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు పరికి కోర్నేల్, బొట్ల నరేష్, అనిల్, రాజు, సమ్మయ్య సోమ్లనాయక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస చట్టం కింద పలువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట, మార్చి 29 : గృహ హింస చట్టం కింద భర్తలో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని గొల్ల భామతండా గ్రామానికి చెందిన భూక్య రాజేందర్‌కు ఇదే గ్రామానికి చెందిన సునితతో 10ఏళ్ల క్రితం వివాహమైంది వీరికి ఇద్దరు అబ్బాయిలు జన్మించారు. కొన్నాళ్లు వీరి జీవితం సాఫీగా సాగినా ఇటీవల సునితను అదనపు కట్నంతో పాటు, పలు రకాల చిత్రహింసలు పెట్టుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు సునిత ఫిర్యాదు మేరకు భర్త రాజేందర్, అత్త వీరమ్మ, మరిది నవీన్, ఆడబిడ్డతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నిర్లక్ష్యంతో.. నీటికష్టాలు..

(5వ పేజీ తరువాయి)

పని చేస్తున్నారు. వీరు ప్రతీ రోజూ వారు పని చేస్తున్న ఫిల్టర్ బెడ్ల వద్ద మూడు షిఫ్టులలో పని చేయాల్సి ఉంది. కానీ కొందరు సిబ్బంది అధికారుల అండదండలతో బయోమెట్రిక్ (వేలిముద్ర) వేసి విధులు నిర్వర్తించకుండా బయటకు వెళ్లిపోతున్నట్టు సమాచారం. ఇంకా కొందరు ఏఈ, డీఈ స్థాయి అధికారులను మచ్చిక చేసుకుని విధులకు రాకున్నా నెలకు కొంత ముట్టజెప్పి జీతాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇంకా కొందరు అధికారులు ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా చెలామణి అవుతూ ఫిల్టర్‌బెడ్ విధులకు డుమ్మా కొడుతున్నారు. వడ్డెపల్లిలో ఒక డ్రైవర్, ఒక లైన్‌మెన్ సుబేదారి కార్యాలయంలో ఉంటూ అధికారుల కొమ్ముకాస్తున్నట్టు తెలుస్తోంది. కేయూ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్లలో పని చేస్తూ నలుగురు సిబ్బంది తంబ్ (వేలిముద్ర) వేసి ఇతర వ్యాపారాలు, కాంట్రాక్టు పంచాయితీలు చేస్తున్నట్టు సమాచారం. కొత్త కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వచ్చిన తర్వాత కూడా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధులకు హాజరు కావడం లేదనే ఆరోపణలున్నాయి. ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేయడంతో పాటు సిబ్బందిని గాడిలో పెట్టాల్సిన బాధ్యత కొత్త కమిషనర్‌పై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

4న వరంగల్ జడ్పీ సర్వసభ్య సమావేశం

హనుమకొండ సిటీ, మార్చి 29: వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న జరగనుంది. అదాలత్ సమీపంలోని జిల్లా పరిషత్ కౌన్సిల్ హాలులో సమావేశాన్ని నిర్వహించనున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ క్రమంలో సమావేశం పరిమిత నిబంధనలకు అనుగుణంగా జరగనుంది. నిధుల కేటాయింపులు, చెల్లింపులు, పరిపాలన సంబంధమైన నూతనంగా నిర్ణయాలకు తావు ఇవ్వకుండా వివిధ అంశాలను సమీక్షించనున్నారు. కాగా, హనుమకొండ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు అదాలత్ సమీపంలోని జిల్లా పరిషత్ కౌన్సిల్ హాలులో సమావేశం జరగనుంది. వివిధ ప్రభుత్వ శాఖల అంశాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.